RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

తెలుగు దినపత్రిక

INFOTAINMENT Voice Today

జన గాత్రం - మన నేత్రం

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, ఏప్రిల్ 3, 2026 | సంపుటి:1 | సంచిక : 3 | పేజీలు: 10 | వెల : రూ.1




## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీ క్లియర్ కట్

పర్యావరణ ముప్పు ఆరోపణలకు ఆధారాల్లేవు

పిటిషన్‌ను కొట్టివేసిన గ్రీన్ ట్రిబ్యునల్

ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమం

'కేవలం అనుమానాలతో అడ్డుకోవడం సరికాదు'

ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం

టీవోఆర్ పరిధిలోనే అన్ని అంశాలు

రాజకీయ దురుద్దేశాలతో పిటిషన్ అన్న వాదన

హైదరాబాద్: ప్రతిష్టాత్మక మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని చేసిన ఆరోపణలకు ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టు అమలుకు మార్గం సుగమమైంది. మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన ఎన్జీటీ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. పిటిషనర్ తరఫున వినిపించిన వాదనల్లో సరైన సాంకేతిక ఆధారాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ అనుమతులు పొందకుండానే పనులు చేపడుతోందని పిటిషనర్ తరఫున ఆరోపణలు చేసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పటికే అనుమతుల కోసం దరఖాస్తు చేసిందని, చేపట్టిన పనులు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్)

(మిగతా 2వ పేజీలో)

## రాజ్యసభలో తెలంగాణ రగడ..

బీజేపీ-కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య ఘర్షణ.. కాళేశ్వరం వ్యాఖ్యలపై వేడెక్కిన సభ

'క్షమాపణ చెప్పాలి' అంటూ సురేశ్‌రెడ్డి హెచ్చరిక.. కేసీఆర్‌పై కిషన్‌రెడ్డి విమర్శలు

అమరావతి పేరుపై రేణుకా చౌదరి సెటైర్లు.. ఐదు గ్రామాల అంశం మళ్లీ ప్రస్తావన





న్యూఢిల్లీ: రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లుపై జరిగిన చర్చ తెలంగాణ అంశాలతో హోరెత్తింది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. పరస్పరం విమర్శలు, ఆరోపణలతో సభలో ఉద్రిక్తత నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జలశక్తి మంత్రి చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. రూ.లక్ష కోట్లు నీళ్లలో కలిసిపోయాయని చెప్పడం సభను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. వెంటనే ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్రం నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించిందని ఆయన స్పష్టం చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై

(మిగతా 2వ పేజీలో)



## 7 మండలాల అప్పగింతలో కిషన్‌రెడ్డి పాత్ర : హరీశ్

పార్లమెంట్‌లో చరిత్ర వక్రీకరణ అంటూ విమర్శలు

విభజన చట్టంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలపై ఆగ్రహం

ఆర్డినెన్స్‌తో ఏపీకి బదిలీ: భాజపాపై నిప్పులు

తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచారని వ్యాఖ్య

కాంగ్రెస్-భాజపా 'చీకటి పొత్తు' అంటూ విమర్శ

హైదరాబాద్: ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించిన వ్యవహారంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాత్ర ఉందని భారాస శాసనసభా పక్ష ఉపనేత టి. హరీశ్‌రావు సంచలన ఆరోపణలు చేశారు. రాజ్యసభలో కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అబద్ధాలు, చరిత్ర వక్రీకరణలతో నిండివున్నాయని తీవ్రంగా విమర్శించారు. విభజన చట్టంలోనే ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలని ఉందని కిషన్‌రెడ్డి పేర్కొనడం పూర్తిగా అవాస్తవమని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనిని తెలంగాణకు చేసిన ద్రోహంగా అభివర్ణించారు. విభజన చట్టానికి సవరణ తీసుకువచ్చి, ఆర్డినెన్స్ ద్వారా మండలాలను ఏపీకి బదిలీ చేసింది

(మిగతా 2వ పేజీలో)

## గ్యారంటీలపై విమర్శలా? తెలంగాణకు రండి : సీఎం

యూడీఎఫ్ హామీల అమలుపై రేవంత్ ధీమా

'తెలంగాణ మోడల్ చూడండి' అంటూ ఆహ్వానం

కేసీఆర్-విజయన్ పాలనపై తీవ్ర విమర్శలు

కేరళలో మార్పు ఖాయం అంటూ జోస్యం

అవినీతి, కుటుంబ పాలనపై వ్యాఖ్యలు

కాంగ్రెస్ ట్రాక్ రికార్డు చూపిస్తాం: సీఎం రేవంత్



హైదరాబాద్: యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నవారికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటు సవాల్ విసిరారు. అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు వచ్చి ప్రత్యక్షంగా చూడాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో అమలవుతున్న పథకాలు తమ నిబద్ధతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. కేరళ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కొచ్చిలో జరిగిన కార్యక్రమంలో యూడీఎఫ్ మ్యానిఫెస్టోను గురువారం

(మిగతా 2వ పేజీలో)

## గ్రూప్-1 నియామకాలకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్

563 పోస్టుల భర్తీకి న్యాయ అడ్డంకులు తొలగింపు

పిటిషన్లను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం

హైకోర్టు తీర్పుకు సుప్రీం మద్దతు

మూల్యాంకన విధానం సరైనదే అన్న స్పష్టం

'ట్రిపుల్ ఎవాల్యుయేషన్'కు కోర్టు ఆమోదం

పిటిషనర్ల ఆరోపణలు నిలవనివి

టీజీపీఎస్సీ వాదనలకు న్యాయస్థానం సమ్మతి



న్యూఢిల్లీ: తెలంగాణలో గ్రూప్--1 నియామకాలకు సంబంధించి నెలకొన్న అనిశ్చితికి సుప్రీంకోర్టు తెరదించింది. 563 పోస్టుల భర్తీ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేస్తూ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

(మిగతా 2వ పేజీలో)



## ఇరాన్‌పై దాడులు ముమ్మరం.. సమీపంలో 'ఖేల్ ఖతం' : ట్రంప్

మరో మూడు వారాల్లో భీకర దాడులు

లక్ష్యాలకు చేరువలో ఉన్నామని అమెరికా స్పష్టం

'రాతియుగంలోకి తీసుకెళ్తాం' అంటూ తీవ్ర హెచ్చరిక

యుద్ధం ముగింపు దశలోనన్న సంకేతాలు

అణు కేంద్రాల ధ్వంసంపై ట్రంప్ వ్యాఖ్యలు

నాటోపై అసంతృప్తి.. మిత్రదేశాలకు సూచనలు

'భవిష్యత్ తరాల కోసం యుద్ధం' అన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: ఇరాన్‌పై యుద్ధం కీలక దశకు చేరుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మరో రెండు నుంచి మూడు వారాల్లో భీకర స్థాయి దాడులు జరగనున్నాయని హెచ్చరిస్తూ, తమ సైన్యం లక్ష్యాలను పూర్తి చేసే దిశగా

(మిగతా 2వ పేజీలో)

## అమరావతి బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం

మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించిన సభ

పలుపార్టీల మద్దతు.. చర్చలో పాల్గొన్న 19 మంది ఎంపీలు

బీజేపీ పాలసీపై అప్రమత్తంగా ఉండాలన్న తృణమూల్, ఆప్

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ నుంచి వాకౌట్

రాష్ట్రపతి ఆమోదం కోసం బిల్లు..

న్యూఢిల్లీ: ఆంధ్రపదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు--2026 గురువారం రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. బిల్లుకు బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్, బీఆర్ఎస్, బీజేడీ, ఆప్, జేడీయూ సహా పలు పార్టీలు మద్దతు ప్రకటించాయి. రెండు గంటల చర్చ అనంతరం ఈ బిల్లుకు సభ మూజువాణి ఓటుతో ఆమోదముద్ర వేసింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభల్లోనూ బిల్లుకు ఆమోదం దక్కినట్లయింది. లోక్‌సభలో బుధవారం ఆమోదం పొందిన బిల్లును గురువారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాలు ముగిశాక ప్రవేశపెట్టారు. బిల్లుపై మొత్తం 19 మంది ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లులో అనేక అంశాలపై స్పష్టత లేదంటూ, బిల్లును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ సభ నుంచి వాకౌట్ చేసింది. బిల్లుపై మాట్లాడిన అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి కేంద్రం అందించే సాయం, ఎప్పటిలోగా నిర్మాణం పూర్తి చేస్తాయో స్పష్టత ఇవ్వాలని

(మిగతా 2వ పేజీలో)



# అమరావతి బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం

డిమాండ్ చేశాయి. రాజధానికి భూములిచ్చిన రైతులను ఆదుకునే ప్రక్రియ, పరిహారంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటన చేయాలని కోరాయి. తన అవసరానికి ప్రాంతీయ పార్టీలను వాడుకొని వదిలేయడం బీజేపీకి అలవాటని, వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించాయి. విభజన జరిగి పదేళ్లయినా ఇంతవరకు ఏపీ, తెలంగాణకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం విఫలమైందని, కడప స్టీల్ ప్లాంట్, తెలంగాణకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పూర్తి చేయలేదని ఎంపీలు పేర్కొన్నారు. ఈ దృష్ట్యా అమరావతిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారో కేంద్రం నిర్దిష్ట కాలపరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. తృణమూల్ ఎంపీ మహ్మద్ నదీముల్ హక్ మాట్లాడుతూ, 'బిహార్‌లో జేడీయూ నితీశ్‌కుమార్‌కు, మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండేకి ఏమి జరుగుతుందో చూస్తున్నారు. వాడుకొని వదిలేయడం (యూజ్ అండ్ త్రో పాలసీ) బీజేపీ విధానం. కావున టీడీపీ అప్రమత్తంగా ఉండాలి' అని సూచించారు. ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ మాట్లాడుతూ, 'కేంద్రంలోని బీజేపీ వైఎస్సార్‌సీపీకి మూడు రాజధానులు చేయుమని ప్రోత్సహించింది.అమరావతిని రాజధాని చేయుమని టీడీపీకి చెబుతోంది. బీజేపీతో జాగ్రత్త..చాలా పార్టీలను మోసం చేసిన చరిత్ర బీజేపీకి ఉంది. కావున జాగ్రత్త' అంటూ హితవు పలికారు. బీజేడీ తరఫున మాట్లాడిన నిరంజన్ బిషీ..పోలవరంతో ఒడిశాలో ముంపుపై సమగ్ర అధ్యయనం జరగాలని, నిరాశ్రయులకు సరైన పరిహారం ఇచ్చేలా చూడాలని కోరారు. ఇక ప్రస్తుత రూపంలో ఉన్న బిల్లును వైఎస్సార్‌సీపీ వ్యతిరేకించింది. 'అమరావతిని మేమెన్నడూ వ్యతిరేకించలేదు. కానీ ఇప్పటికే 50వేల ఎకరాలు రైతుల నుంచి సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క శాశ్వత భవనాన్ని నిర్మించలేదు. అలాంటి రాజధానిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారు. నిర్మాణం పూర్తయ్యేందుకు అవసరమయ్యే రూ.2లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారన్న దానిపై స్పష్టత లేదు' అని వైఎస్సార్‌సీపీ తరఫున మాట్లాడిన పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు సభ నుంచి



వాకౌట్ చేశారు.

**రాష్ట్రపతి పరిశీలనకు బిల్లు..**

బిల్లుపై చర్చ ముగిసిన అనంతరం మంత్రి నిత్యానంద్ రాయ్ సభకు బిల్లు వివరాలు వెల్లడించారు. అనంతరం బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఉభయ సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించడంతో తదుపరి ఆమోదానికి బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపనున్నారు.

# ఇరాన్‌తో యుద్ధం వేళ.. అమెరికా సైన్యంలో సంచలనం!

అమెరికా సైన్యంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. యూఎస్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ రాండీ జార్జ్‌ను తక్షణమే పదవి నుంచి వైదొలగాలని రక్షణ కార్యదర్శి పీట్ హెగ్?సెత్ ఆదేశించారు. ఇరాన్‌తో అమెరికా యుద్ధం కొనసాగుతున్న కీలక తరుణంలో ఆర్మీ అత్యున్నత అధికారిపై వేటు వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జనరల్ జార్జ్ వెంటనే పదవీ విరమణ చేస్తున్నారని పెంటగాన్ అధికారికంగా ధ్రువీకరించింది. అయితే, జార్జ్‌ను అర్ధాంతరంగా తొలగించడానికి గల కచ్చితమైన కారణాలను పెంటగాన్ వెల్లడించలేదు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన ఆలోచనా విధానాలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం సైన్యంలో ఉండాలని హెగ్?సెత్ భావిస్తున్నారని, అందుకే ఈ మార్పులు చేస్తున్నారని కథనాలు వెలువడుతున్నాయి. సాధారణంగా నాలుగేళ్ల పదవీకాలం ఉండగా, 2023లో బాధ్యతలు చేపట్టిన జార్జ్ కేవలం 18 నెలల్లోనే వైదొలగాల్సి వచ్చింది. గతేడాది హెగ్?సెత్ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సైన్యంలో ఉన్నతస్థాయి అధికారుల తొలగింపు పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఆయన డజనుకు పైగా ఉన్నతాధికారులను పదవుల నుంచి తప్పించారు. జార్జ్ స్థానంలో ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ క్రిస్టోఫర్ లానేవ్ యాక్టింగ్ చీఫ్‌గా వ్యవహరించనున్నారు. లానేవ్ గతంలో హెగ్?సెత్‌కు టాప్ మిలిటరీ ఎయిడ్‌గా పనిచేయడం గమనార్హం. ఇరాక్, అఫ్ఘనిస్థాన్ యుద్ధాల్లో పనిచేసిన అనుభవజ్ఞుడైన జార్జ్‌ను తొలగించడం అమెరికాలో చర్చనీయాంశంగా మారింది.



# తెలంగాణలో కరెంట్ షాక్‌తో చనిపోతే రూ.8 లక్షలు.. ఛార్జీల పెంపు లేదు: టీ-ఈఆర్సీ కీలక నిర్ణయాలు

తెలంగాణలో విద్యుత్ వినియోగదారులకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఒకేసారి రెండు శుభవార్తలు అందించింది. రాష్ట్రంలో ఎవరైనా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మరణిస్తే ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను భారీగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ఈ ఏడాది కరెంట్ ఛార్జీల పెంపు ఉండబోదని స్పష్టం చేసి ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన టారిఫ్ ఆర్డర్‌ను తాజాగా ఈఆర్సీ విడుదల చేసింది.

**విద్యుత్ ప్రమాద మృతులకు భారీగా పెరిగిన పరిహారం.. 2 నెలల్లోనే చెల్లింపు**

ఇప్పటివరకు విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తుండగా, దానిని మరో రూ.3 లక్షలు పెంచి రూ.8 లక్షలు చేసింది. ఈ పెంచిన పరిహారం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. బాధితుడి కుటుంబానికి రెండు నెలల్లోపే ఈ సొమ్మును అందించాలని, జాప్యం జరిగితే అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా వివరించాలని డిస్కంలను ఆదేశించింది. వినియోగదారుడి తప్పిదం వల్ల ప్రమాదం సంభవించినా ఈ పరిహారం వర్తిస్తుందని స్పష్టం చేయడం గమనార్హం.

**పాత ఛార్జీలే కొనసాగింపు**

మరోవైపు ఈ ఏడాది కూడా పాత కరెంట్ ఛార్జీలనే కొనసాగించాలని ఈఆర్సీ నిర్ణయించింది. ఛార్జీల పెంపు ప్రతిపాదన ఏదీ లేదని స్పష్టం చేసింది. దీంతో పాటు ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్లాంట్ల వినియోగదారులకు ఊరట కల్పించింది. అదనపు యూనిట్ల వాడకంపై అధిక శ్లాబుల ప్రకారం వసూలు చేసిన అదనపు మొత్తాన్ని రాబోయే మూడు నెలల బిల్లుల్లో సర్దుబాటు చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలుకు రూ.49,230 కోట్లకు, ఇతర వ్యయాలతో కలిపి మొత్తం




రూ.64,950 కోట్లకు ఈఆర్సీ ఆమోదం తెలిపింది. అయితే, టీఎస్ఎన్‌పీడీసీఎల్, టీఎస్ఎస్‌పీడీసీఎల్‌ల ఆదాయ, వ్యయాల మధ్య సుమారు రూ.15,106 కోట్ల లోటు ఏర్పడుతుందని ఈఆర్సీ అంచనా వేసింది. ఈ లోటును భర్తీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.14,000 కోట్ల ఆర్థిక సహాయం అందించడానికి అంగీకరించిందని తెలిపింది. మిగిలిన లోటును డిస్కంల రెగ్యులేటరీ ఆస్తిగా పరిగణించాలని సూచించింది.

## తెలంగాణ ఎక్సైజ్ ఆదాయంలో సరికొత్త చరిత్ర.. రూ.44,557 కోట్లు ఆర్జించిన శాఖ

తెలంగాణ ఎక్సైజ్ శాఖ ఆదాయంలో సరికొత్త రికార్డు సృష్టించింది. శాఖ చరిత్రలో తొలిసారిగా ఒక ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.44,000 కోట్ల మైలురాయిని అధిగమించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎక్సైజ్ శాఖకు అన్ని మార్గాల ద్వారా కలిపి మొత్తం రూ.44,557 కోట్ల ఆదాయం సమకూరింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఒకే ఏడాదిలో ఇంత భారీ మొత్తంలో ఆదాయం



రావడం ఇదే ప్రథమం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.40,209 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. దీని ద్వారా ప్రభుత్వానికి ఎక్సైజ్ సుంకం రూపంలో రూ.39,368 కోట్ల ఆదాయం లభించింది. వీటికి అదనంగా, రాష్ట్రంలోని 2,620 మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజుల ద్వారా రూ.1,771 కోట్లు, 1,214 బార్ల ద్వారా రూ.549 కోట్లు వచ్చాయి. ఇక కొత్తగా ఏర్పాటు చేసిన దుకాణాల లైసెన్స్‌ల కోసం వచ్చిన దరఖాస్తుల రూపంలో నాన్-రిఫండబుల్ ఫీజు కింద మరో రూ.2,869 కోట్లు ఖజానాకు చేరాయి. గత ఏడేళ్ల కాలంలో ఎక్సైజ్ ఆదాయం రెట్టింపు కావడం గమనార్హం. 2018-19లో రూ.20,859 కోట్లుగా ఉన్న రాబడి, 2025-26 నాటికి రూ.44 వేల కోట్లను దాటింది. పరిమాణం పరంగా చూస్తే మద్యం (లిక్కర్) విక్రయాలు పెరిగినా, బీర్ల అమ్మకాలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. గత ఏడాదితో పోలిస్తే బీర్ల విక్రయాలు 9 శాతం తగ్గి 387.34 లక్షల కేసులకు పరిమితమయ్యాయి. 2025 డిసెంబరులో పంచాయతీ ఎన్నికలు, నూతన సంవత్సర వేడుకల కారణంగా రికార్డు స్థాయిలో రూ.5,051 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి.



## హనుమకొండలో తీవ్ర విషాదం.. స్విమ్మింగ్ పూల్‌లో తల్లి, ఇద్దరు కూతుళ్ల అనుమానాస్పద మృతి

ఓ తల్లి, ఆమె ఇద్దరు కుమార్తెలు స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషాదకర ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలో నిన్న రాత్రి జరిగింది. పోలీసులు ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. పున్నేలు గ్రామానికి చెందిన అజారుద్దీన్, ఫర్హత్ (26) దంపతులు. వీరికి ఉమేరా (8), ఆయేషా (6) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అజారుద్దీన్ స్థానికంగా ఓ స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నిన్న రాత్రి కుటుంబ సభ్యులంతా స్విమ్మింగ్ పూల్ వద్దకు వెళ్లారు. కాసేపటి తర్వాత ఫర్హత్, ఆమె ఇద్దరు కూతుళ్లు పూల్‌లో శవాలై తేలారు. సమాచారం అందుకున్న ఐనవోలు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఫర్హత్ ఇటీవల మూడోసారి గర్భం దాల్చిందని, ఈ విషయంపై భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కూతురు, మనవరాళ్ల మృతిపై వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో మృతురాలి తండ్రి అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## 7 మండలాల అప్పగింతలో కిషన్‌రెడ్డి పాత్ర : హరీశ్



భాజపా ప్రభుత్వమేనని ఆరోపించారు. ఈ ప్రక్రియలో కిషన్‌రెడ్డి పాత్ర కూడా ఉందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ విషయాన్ని మరిచి ఇప్పుడు భారాసపై విమర్శలు చేయడం తగదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలే ఇప్పుడు కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో పునరావృతం చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. ఇది కాంగ్రెస్, భాజపా మధ్య ఉన్న 'చీకటి పొత్తు'కు నిదర్శనమని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నీళ్లు పంట పొలాల్లో ప్రవహిస్తున్న వాస్తవాన్ని చూపించేందుకు తాను సిద్ధమని, కిషన్‌రెడ్డి వచ్చి చూడాలని సవాల్ విసిరారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా భాజపా, కాంగ్రెస్ ఎంపీలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

# రాజ్యసభలో తెలంగాణ రగడ..

కేంద్రాన్ని నిలదీశారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. భద్రాచలం మండలాల అంశం విభజన చట్టంలోనే ఉందని పేర్కొంటూ, అప్పటి పరిస్థితులను ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజల డబ్బుతో నిర్మించిందని, అది కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అమరావతి పేరుపై వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. 'పెట్టరా పేరు అమరావతి.. లేకపోతే కమ్మరావతి పెట్టండి' అంటూ వ్యాఖ్యానించారు. కేంద్రం ఏపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని, తెలంగాణకు ఇచ్చిన హామీలను మాత్రం విస్మరిస్తోందని మండిపడ్డారు. భద్రాచలం పరిసర గ్రామాల సమస్యను కూడా ఆమె ప్రస్తావించారు. ఆ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కోరారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. మొత్తంగా రాజ్యసభ చర్చ తెలంగాణ రాజకీయ వేడిని ప్రతిబింబిస్తూ తీవ్ర వాగ్వాదాలకు వేదికగా మారింది.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీ క్లియర్ కట్

నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది. కేవలం అనుమానాలు, ఊహాగానాల ఆధారంగా ప్రాజెక్టులను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. ఈ దశలో విచారణ కొనసాగించడం అవసరం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్రాజెక్టు పనులు చట్టబద్ధంగానే కొనసాగుతున్నాయని ప్రభుత్వం తరఫు వాదనలను ఎన్జీటీ సమర్థించింది. పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలన్నీ ఇప్పటికే పర్యావరణ మదింపు అథారిటీ జారీ చేసిన విధివిధానాల్లో ఉన్నాయని తెలిపింది. దీంతో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, సుందరీకరణ పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లే అవకాశం లభించింది.

# గ్యారంటీలపై విమర్శలా? తెలంగాణకు రండి : సీఎం

రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణలో సాధించిన మార్పు మాదిరిగానే కేరళలో కూడా ఈసారి మార్పు ఖాయమని జోస్యం చెప్పారు. గత పదేళ్లుగా పినరయి విజయన్ ప్రభుత్వం కేరళలో కొనసాగుతోందని, అదే విధంగా తెలంగాణలో కూడా దాదాపు దశాబ్దం పాటు కేసీఆర్ పాలన సాగిందని గుర్తుచేశారు. ఈ రెండు ప్రభుత్వాల మధ్య కుటుంబ పాలన, అవినీతి, అసమర్థత వంటి అంశాల్లో స్పష్టమైన పోలికలు ఉన్నాయని విమర్శించారు. విజయన్ తమ రాజకీయ ప్రత్యర్థి అని స్పష్టం చేసిన రేవంత్‌రెడ్డి, అవినీతి నియంత్రణ, రాష్ట్ర ఆదాయాన్ని కాపాడటం, కేంద్ర పథకాల గరిష్ఠ వినియోగం, రాష్ట్రానికి రావాల్సిన నిధుల సాధన తమ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని, అవి ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. వాటిని సాధించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, ఈ కూటమిలో నిజాయతీ గల నాయకత్వం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ట్రాక్ రికార్డు ఆధారంగా ప్రజలు విశ్వసించాలని కోరారు.

# గ్రూప్-1 నియామకాలకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్

ఇచ్చింది. దీంతో టీజీపీఎస్సీ చేపట్టిన నియామక ప్రక్రియకు పూర్తి న్యాయబద్ధత లభించింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పిటిషన్లను తిరస్కరిస్తూ తుది తీర్పును వెలువరించింది. గ్రూప్--1 మెయిన్స్ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో పిటిషనర్లు కోర్టును ఆశ్రయించినప్పటికీ, కమిషన్ అనుసరించిన విధానాల్లో ఎలాంటి లోపాలు లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుందని పేర్కొంది. విచారణ సందర్భంగా టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. నియామక ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని, మెయిన్స్ మూల్యాంకనంలో 'ట్రిపుల్ ఎవాల్యుయేషన్' విధానాన్ని అమలు చేసినట్లు వివరించారు. మూల్యాంకనకర్తల మధ్య ఉండే మార్కుల వ్యత్యాసాలను తగ్గించడానికే ఈ పద్ధతిని అమలు చేశామని తెలిపారు. మొదటి రెండు దశల్లో బార్‌కోడ్ విధానం పాటించగా, మూడో దశలో గోప్యత పరిరక్షణ కోసం ప్రత్యేక విధానం అనుసరించినట్లు స్పష్టం చేశారు. పిటిషనర్లు చేసిన ఆరోపణలు సాంకేతిక ఆధారాలు లేని వాదనలేనని కోర్టు అభిప్రాయపడింది. కమిషన్ సమర్పించిన అఫిడవిట్లు, ఆధారాలను పరిశీలించిన అనంతరం నియామకాల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని తేల్చిచెప్పింది. దీంతో గ్రూప్--1 అభ్యర్థులకు పెద్ద ఊరట లభించగా, నియామక ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఏర్పడింది.

# ఇరాన్‌పై దాడులు ముమ్మరం.. సమీపంలో 'ఖేల్ ఖతం' : ట్రంప్

వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ట్రంప్ స్పష్టం చేస్తూ, ఇప్పటివరకు అనేక వ్యూహాత్మక లక్ష్యాలను సాధించామని, కొన్నిసార్లు లక్ష్యాన్ని మించి విజయాలు సాధించామని చెప్పారు. యుద్ధం ముగింపు దశలో ఉందని సంకేతాలు ఇచ్చారు. ఇరాన్‌పై మరింత తీవ్ర దాడులకు సిద్ధమవుతున్నామని పేర్కొంటూ, శత్రువును ఈసారి గట్టిగా దెబ్బకొడతామని హెచ్చరించారు. ఇరాన్‌ను రాతియుగంలోకి తీసుకెళ్తామని చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. ఇరాన్ అణు కార్యక్రమాలను అడ్డుకోవడమే ఈ యుద్ధం ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు. ఇప్పటికే అనేక అణు కేంద్రాలను ధ్వంసం చేశామని, ఉపగ్రహాల ద్వారా నిఘా కొనసాగుతున్నదని వెల్లడించారు. మళ్లీ అణ్వాయుధాల దిశగా అడుగులు వేస్తే క్షిపణులతో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. హోర్ముజ్ జలసంధిపై ప్రపంచ దేశాలు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గల్ఫ్ చమురుపై ఆధారపడే దేశాలు తమ బాధ్యతను గుర్తించాలన్నారు. నాటో కూటమిపై కూడా ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని దేశాలు సహకరించడం లేదని విమర్శిస్తూ, నాటోను 'పేపర్ టైగర్'గా అభివర్ణించారు. అమెరికా లేకపోతే ఆ కూటమి విలువ ఏమిటని ప్రశ్నించారు. ఇరాన్‌పై యుద్ధం భవిష్యత్ తరాల భద్రత కోసం తీసుకున్న నిర్ణయమని ట్రంప్ పేర్కొన్నారు. అణ్వాయుధాలు ఇరాన్ చేతుల్లో ఉండడం ప్రపంచానికి ముప్పని, అందుకే ఈ యుద్ధం అనివార్యమైందని వివరించారు. అమెరికా ప్రజల్లో యుద్ధంపై సహనం తగ్గుతోందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. అయినప్పటికీ, తమ దేశ భద్రత కోసం అవసరమైన చర్యలు తప్పక తీసుకుంటామని స్పష్టం చేశారు.

# భద్రాచలం పరిసర 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలి

## - రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు విజ్ఞప్తి




భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా అభివృద్ధి చెందాలని తమ పార్టీ ఆకాంక్ష అని తెలిపారు. అయితే రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు చెందిన కొన్ని మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అప్పగించడం అన్యాయమని పేర్కొన్నారు.

భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఎటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమపట్నం, గుండాల గ్రామాలు ఆలయానికి అత్యంత సమీపంలో ఉన్నాయని, భద్రాచలం దేవస్థానం భూములలో చాలా భాగం ఈ గ్రామాల పరిధిలోనే ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో వాటిని తిరిగి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని కోరారు. ఇక తెలంగాణ అభివృద్ధిపై మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి రాష్ట్రం సస్యశ్యామలంగా మారిందని తెలిపారు. ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగిందని పేర్కొన్నారు. అలాగే, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్రం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీకి నిధులు, బయ్యారం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలను త్వరగా పూర్తి చేసి సేవలు ప్రారంభించాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్త ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఖమ్మం--కొత్తగూడెం--భద్రాచలం కారిడార్‌ను నాలుగు లైన్లుగా విస్తరించి రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## నాగారం ఉమామహేశ్వరస్వామి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

నాగారం, ఏప్రిల్ 2:-(వాయిస్ టుడే): మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ పరిధి నాగారంలోనీ ఉమామహేశ్వర ఆలయంలో గురువారం నూతన సహస్ర లింగేశ్వర స్వామి, కాలభైరవ స్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో నాగారంకు చెందిన పలువురు ప్రముఖులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్ గౌడ్, బి శ్రీకాంత్, బి శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, పంతులు చరణ్, ఆలయ కమిటీ అధ్యక్షులు మురళి చారి, ఇతర సభ్యులు రామచంద్ర, మహేష్, కొట్టే అనిల్ పాల్గొన్నారు.




## ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి

### దళిత బహుజన వీరునికి ఘన నివాళి

నాగారం, ఏప్రిల్ 2:-(వాయిస్ టుడే): దళిత బహుజన విప్లవ వీరుడు, స్వయం పరిపాలనకు మార్గదర్శకుడు అయిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఈసీఐఎల్ చౌరస్తాలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ నాయకుడు గోగీకర్ శివకుమార్ మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, స్వాభిమానానికి ఆయన చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న ఆశయాలను కొనసాగిస్తూ దళిత బహుజన హక్కుల కోసం ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, దళిత బహుజన బంధువులు పాల్గొన్నారు.

## భార్య, భర్తల మధ్య విభేదాలు మనస్థాపంతో భర్త ఆత్మహత్య



నాగారం, ఏప్రిల్ 2:-(వాయిస్ టుడే)భార్య, భర్తల మధ్య గొడవలతో మనస్థాపానికి గురైన భర్త ఆత్మహత్య పాల్పడిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కీసర మండలం ఆహ్మేదగూడ శ్రీలక్ష్మీ ఎన్ క్లేవ్ చెందిన వీణాపాణి అసమె భర్త జోసెఫ్ మధ్య గత కొంత కాలంగా గొడవలు, విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 31న తన భర్తకు తనకు గొడవలు ఉన్నాయని కీసర పోలీస్ స్టేషన్లో భర్తపై పిర్యాదు చేయగా కేసును నమోదు చేసామని చెప్పారు. అదే రోజు సాయంత్రం వీణాపాణీ భర్త అయిన డాక్టర్ జోసెఫ్ వినోద్ కుమార్(40) అవుటర్ రింగ్ రోడ్ రాంపల్లి దాయర వద్ద కారులో గుర్తు తెలియని ఇంజక్షన్ ద్వారా ఆత్మహత్య చేసుకున్నాడని మృతుని తండ్రి ఆరోగ్యమయ్య పోలీస్ స్టేషన్లో కొడలుపై పిర్యాదు చేసాడు. నా కుమారుడు జోసెఫ్ అతని భార్య వీణపాణి మానసిక వేధింపులు తట్టుకోలేక ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి బోరున విలపించాడు. మృతి చెందిన జోసెఫ్ మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ రెండు కేసులను అనుసంధానించి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి సాక్షాధారాల అధారంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 2(వాయిస్ టుడే): హనుమాన్ జయంతి సందర్భంగా పలు కాలనీల ఆలయ కమిటీల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్భంగా..... స్వామివారిని దర్శించుకొని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖలు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు....అనంతరం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణి కార్యక్రమంలో కూడా పాల్గొని భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అలాగే ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రదేశ్ కమిటీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నూతన నియామకాలు

కుత్బుల్లాపూర్ ( వాయిస్ టుడే ) ఏప్రిల్ 2: తెలంగాణ ప్రదేశ్ కమిటీకి చెందిన మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులుగా కూన శ్రీనివాస్ గౌడ్ నియమితులైన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మాపై ఇంత నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో ఇతర నియామకాలు ఈ విధంగా ఉన్నాయి: జనరల్ సెక్రెటరీ రాము గౌడ్, జిమ్మీ దేవేందర్ జిల్లా సెక్రెటరీ బుచ్చిరెడ్డి, మెట్ట శ్రీనివాస్ యాదవ్, బొబ్బరంగారావు, ఎగ్జిక్యూటివ్ నెంబర్ బాలప్ప ఏరువా వెంకటరమణ నియమితులయ్యారు.




## హనుమాన్ జయంతి సందర్భంగా విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న డెగల సతీష్ బాబు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 2(వాయిస్ టుడే): హనుమాన్ విజయోత్సవం ఽ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన మహా ఊరేగింపు కార్యక్రమం జగద్గిరిగుట్ట సాల్సిర్ హనుమాన్ మందిరం నుండి ప్రారంభమై, శ్రీనివాసనగర్, చంద్రగిరి నగర్, ఉషోదయ కాలనీ, షాపూర్ నగర్, చింతల్, ఐడీపీఎల్ ప్రాంతాల మీదుగా తిరిగి జగద్గిరిగుట్ట సాల్సిర్ హనుమాన్ మందిరానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో డెగల సతీష్ బాబు గురుప్రసాద్ గడిల సాయి కుమార్ సాయి పంతులు పటేల్ తదితరులు పాల్గొన్నారు. ఈ మహా ఊరేగింపులో లక్షలాది హిందూ భక్తులు, హిందూ బంధువులు పాల్గొని కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడం విశేషం. కార్యక్రమం ప్రశాంతంగా, పవిత్రంగా జరగడం చాలా సంతోషకరం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి హిందూ బంధువులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



## న్యూ ఢిల్లీలో ఉప రాష్ట్రపతికి బీఆర్ఎస్ ఎంపీల సన్మానం

### - డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌తో భేటీ



పార్లమెంట్ సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎంపీలు మర్యాదపూర్వకంగా ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్‌ను కలుసుకొని సన్మానించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ కే.ఆర్. సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావులు గురువారం రాత్రి ఛైర్మన్ ఛాంబర్‌లో శాలువాతో సత్కరించారు. అనంతరం ఈ ముగ్గురు ఎంపీలు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొద్దిసేపు పరస్పర విషయాలపై ఇష్టాగోష్టిగా చర్చించారు. ఈ సమావేశాలు స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగినట్లు సమాచారం.

## రాంపల్లి దాయరలో వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

నాగారం, ఏప్రిల్ 2:-( వాయిస్ టుడే)కీసర మండలం రాంపల్లి దాయర వెంకునిగిట్టపై వెలసిన శ్రీ హేమాద్రి వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం ఆలయ ఛైర్మన్ హనుమంతరెడ్డి దంపతులు ఈ వేడుకలు నిర్వహించారు. అంతకుముందు వేకుబ జామున స్వామి వారి పల్లకితో భక్తులు భారీ సంఖ్యలో గిరి ప్రదర్శన చేసారు. గోవింద నామస్మరణతో గుట్ట పరిసర ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక శోభతో మారుమ్రోగాయి. ఈ సందర్భంగా భక్తులకు భారీగా తీర్ధప్రసాదాలు అందజేసారు.



## ఎన్జీఆర్ఐ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి

నాగారం, ఏప్రిల్ 2:-(వాయిస్ టుడే): హనుమాన్ జయంతి సందర్భంగా ఎన్జీఆర్ఐ హబ్సిగూడ అభయ ఆంజనేయ స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయస్వామి ఆశిస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పైయి ఉండాలని ఆకాంక్షించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి. ఈ కార్యక్రమం లో ఈవో వెంకన్న, బజారు పాండ్దు గౌడ్, దేవాలయ కమిటీ సభ్యులు బికుమల్లా అంజయ్య గుప్తా, ఈగ అంజనేయులు, తుమ్మల దేవి రెడ్డి, బుసం రఘునాథ్ రెడ్డి, వర్కాల మదన్ గౌడ్, కడప నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమార్, రాఘవేంద్దర్,బీమ్ సేన్, కాంగ్రెస్ నాయకులు వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్, సుంకు శేఖర్ రెడ్డి, మంద మురళీకృష్ణ రెడ్డి, సచిన్, చింటు పాల్గొన్నారు.

## వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేవే చలివేంద్రాలు: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి




నాగారం, ఏప్రిల్ 2:-(వాయిస్ టుడే): ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ పోచమ్మ గుడి ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఎండలు తీవ్రంగా పెరుగుతున్న ఈ సమయంలో ప్రజలకు చల్లని నీరు, త్రాగునీటి సౌకర్యం అందిస్తూ ప్రతి ఒక్కరు వేసవిలో కొంత ఉపశమనం పొందాలనే ఉద్దేశ్యంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం ప్రశంసనీయం అన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభం కావడం స్థానిక ప్రజలకు ఆనందాన్ని కలిగించింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చర్లపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్ కుషాయిగూడ డివిజన్ టీచర్స్ కాలనీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు ఆలేటి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కైసర్‌నగర్‌లో "ఘనంగా హనుమాన్" జయంతి వేడుకలు

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 2(వాయిస్ టుడే): 125 – గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ లోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... భక్తుల కోరిన కోరికలను నెరవేరుస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవం అభయాంజనేయ స్వామి అని, స్వామివారి కృపా కటాక్షాలు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీమాన్ మొబైల్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 2(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం సూరారం చౌరస్తాలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీమాన్ మొబైల్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుంటోజు నవీన్ మాట్లాడుతూ అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు.ఆంజనేయ స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచితంగా మజ్జిగను పంపిణీ చేయడం జరిగింది.భక్తులు కోరిన కోరికలు నెరవేరుస్తూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునే దైవం ఆంజనేయస్వామి భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ,నాయకోటి రవి, రాజేందర్, వారాల అజయ్,శ్రీకాంత్ యాదవ్,జొన్నవాడ రాజు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## మన సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టే మహత్తర వేదికలు శోభాయాత్రలు

### హనుమాన్ శోభాయాత్రలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 2( వాయిస్ టుడే ): 126--జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై గల సాలాసర్ నిర్వహించిన శ్రీ హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై శోభాయాత్రను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....సేవ, శక్తి, నిబద్ధతకు ప్రతీక అయిన హనుమంతుడిని ఆదర్శంగా తీసుకొని యువత సమాజ నిర్మాణంలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. ఇటువంటి శోభాయాత్రలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించే మహత్తర వేదికలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్ సిటీ వైస్ చైర్మన్ డాక్టర్ ప్రీతి రెడ్డి మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పటాన్చెరులో శోభాయమానంగా హనుమాన్ జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్చెరు పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శోభాయమానంగా జరుగుతున్నాయి. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్, మహాదేవుని ఆలయం, చైతన్య నగర్, నర్ర బస్తి, శాంతినగర్, జెపి కాలనీ పంచముఖి హనుమాన్ దేవాలయాలలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులందరూ సనాతన ధర్మాన్ని ఆచరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.. భారతీయ పురాణాలలో అపారమైన భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీకగా నిలిచిన హనుమంతుని జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా నిలుస్తుందని అన్నారు. నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అనంతరం పంచముఖి హనుమాన్ దేవాలయం వద్ద వీర హనుమాన్ శోభాయాత్రను జెండా ఊపి ప్రారంభించారు.



## పటాన్చెరులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

పటాన్ చెరు పట్టణంలోని శాంతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన శోభాయాత్రలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. వందల సంఖ్యలో మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కాలనీలో ఉత్సాహభరితమైన పండుగ వాతావరణం నెలకొల్పారు. అలాగే పటాన్చెరులో ప్రాచీన కాలం నుండి ప్రసిద్ధి చెందిన చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో జరిగిన పల్లకి సేవ కార్యక్రమంలో కూడా పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ ప్రాంత ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పటాన్‌చెరులో ఉద్రిక్తత -- కాట శ్రీనివాస్ గౌడ్ నివాసం వద్ద పోలీసుల ముట్టడి



పటాన్‌చెరు నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నిన్న నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చేసిన సవాల్ ప్రకారం బీరంగూడ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించిన కాట శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆయన నివాసం వద్ద భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి, ఇంటిని ముట్టడించారు. కాట శ్రీనివాస్ గౌడ్ శివాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు ముందుగానే అడ్డుకోవడంతో పరిస్థితి రణరంగంగా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు మరియు పోలీసుల మధ్య తీవ్ర స్థాయిలో తోపులాట జరిగింది. చర్చకు వెళ్లకుండా తమను గృహనిర్బంధం చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని కాట శ్రీనివాస్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనను పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



## గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నాచారం (వాయిస్ టుడే):నాచారం హెచ్ఎంటి నగర్ హనుమాన్ మందిరం వద్ద ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు -- భక్తులకు 'రవ్వ కేసరి' ప్రసాద వితరణ పోతగాని గోపాల్ గౌడ్ హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈరోజు హెచ్ఎంటి నగర్ హనుమాన్ గుడి లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ మరియు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ?భక్తుల సౌకర్యార్థం మరియు స్వామివారి అనుగ్రహం కోసం ఆలయ కమిటీ,నిర్వాహకుల ఆధ్వర్యంలో భారీగా రవ్వ కేసరి ప్రసాద వితరణ కార్యక్రమం బిజెపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టి. ఉదయం నుంచే ఆలయానికి పోటెత్తిన భక్తులకు నిర్వాహకులు స్వయంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ గౌడ్ మాట్లాడుతూ "సమస్త మానవాళి క్షేమంగా ఉండాలని, ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకుంటూ ఈ ప్రసాద వితరణ చేపట్టాం. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు," అని తెలిపారు.? ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులు చంద్రమౌళి,రాజిరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ , పోతగాని విజయలక్ష్మి, ఎ.మంజుల వాణి, పార్వతి జీ , బాలు,నవీన్ చింటూ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నాతోపాటు చంద్రమౌళి,రాజిరెడ్డి, యోగేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ , పోతగాని విజయలక్ష్మి, ఎ.మంజుల వాణి, పార్వతి జీ , బాలు,నవీన్ చింటూ పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయాలలో ప్రత్యేక పూజలు చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):- హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు హనుమాన్ ఆలయాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..శ్రీ హనుమంతుడు భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక. హనుమాన్ జయంతి అంటే మనసుకు, శరీరానికి శక్తి, ధైర్యం, నిబద్ధతను ఇచ్చే పర్వదినం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే గుణానికి ఆంజనేయుడే నిదర్శనం. హనుమాన్ జయంతిని అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.అసాధ్యమైన కార్యాలను సుసాధ్యం చేసే కార్యసాధకుడు.భయాలను పోగొట్టి ధైర్యాన్ని నింపే అభయాంజనేయుడు. ఆ వాయుపుత్రుని ఆశీస్సులతో ప్రజలందరికీ విజయం, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఈలో శివప్రసాద్‌కు పీహెచ్.డీ



పటాన్ చెరు (వాయిస్ టుడే) : హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ) పరిశోధక విద్యార్థి, గీతం అధ్యాపకుడు వి.శివప్రసాద్ నాయక్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'సబ్-6 గిగాహెర్ట్జ్ అనువర్తనాల కోసం సూక్ష్మ, సబ్ స్ట్రేట్-సమాకలిత తరంగమార్గ-ఆధారిత వీ×మీా యాంటెన్నాల నూతన రూపకల్పన, అమలు'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న ఈఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.మంజునాథాచారి గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ అధ్యయనం సబ్-6 గిగాహెర్ట్జ్ 5జీ అనువర్తనాల కోసం అధిక పనితీరు గల, సూక్ష్మీకరించిన యాంటెనాలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టినట్టు తెలిపారు. సబ్ స్ట్రేట్ ఇంటిగ్రేటెడ్ వేవ్ గైడ్ (ఎస్ఐడబ్ల్యూ) సాంకేతికత, హాఫ్-మోడ్ (హెచ్ఎంఎస్ఐడబ్ల్యూ), క్వార్టర్-మోడ్ (క్యూఎంఎస్ఐడబ్ల్యూ) వంటి వినూత్న పద్ధతులను ఉపయోగించుకోవడం ద్వారా, గెయిన్, బ్యాండ్ విడ్త్ లో రాజీ పడకుండా యాంటెనా పరిణామాన్ని తగ్గించడం ఈ పరిశోధన లక్షమన్నారు. ప్రతిపాదిత మల్టీ-పోర్ట్ వీ×మీా యాంటెనాలు మల్టీ-బ్యాండ్ ఆపరేషన్లకు మద్దతిస్తాయని, అధిక వృద్ధి, విస్తృత బ్యాండ్ విడ్త్, బలమైన పోర్ట్ ఐసోలేషన్, అధిక వైవిధ్యం, చాలా తక్కువ ఎన్వలప్ కోరిలేషన్ తో సహా అద్భుతమైన పనితీరును కనబరుస్తాయని తెలిపారు.

మూడు అంతర్జాతీయ జర్నల్స్ లో పరిశోధనా పత్రాలను ప్రచురించడంతో పాటు, స్కోపస్ ఇండెక్స్ చేసిన ఏడు సమావేశ పత్రాలు, ఒక అంతర్జాతీయ సదస్సులో ఉత్తమ పత్ర పురస్కారాలను డాక్టర్ శివప్రసాద్ అందుకున్నట్టు వివరించారు. డాక్టర్ శివప్రసాద్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి తాతినేనిలతో పాటు, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలియజేసినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి మరియు కాట దంపతులు



వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు : పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామంలో సర్పంచ్ ఎల్లగోని విక్రమ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహా చండీ సాహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ మరియు సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా పాల్గొని, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించడంతో పాటు, సమాజంలో మానవతా విలువలను పెంపొందించేందుకు తోడ్పడతాయన్నారు. దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సేవకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు మా పూర్తి మద్దతు ఉంటుందని" తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు వ్యవసాయ కమిటీ చైర్మన్ శివానందం, నందిగామ ఉపసర్పంచ్ గోరెమియ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



## మీకు మీ కుటుంబ సభ్యులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు: బి గడిల శ్రీకాంత్ గౌడ్

### హనుమాన్ శోభ యాత్రలో పాల్గొన్న గడీల శ్రీకాంత్ గౌడ్

పటాన్ చెరు : ఇస్నాపూర్ మున్సిపల్ ఇస్నాపూర్ ఎక్స్ రోడ్ లోని శివాలయం వద్ద బీఆర్ఎస్ నాయకుడు సుల్తాన్ పూర్ దయాకర్ ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న పటాన్ చెరు మండల ఇంచార్జ్ మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమంతుడు బలానికి, సాటిలేని భక్తికి, నిస్వార్థ సేవకు ప్రతీక అని ఆయన అన్నారు....శ్రీరాముని చరణాల సేవకుడైన హనుమంతుడి ఆధ్యాత్మిక శక్తి మన అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ బురిగారి వెంకట్ రెడ్డి ,ఎల్లకొండ మల్లారెడ్డి ,మాజీ వార్డు సభ్యుడు జనార్దన్ రెడ్డి ,ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్స్ మచ్చ కిషోర్ రెడ్డి ,ఎల్లకొండ రాహుల్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు మోట శ్రీకాంత్,వీరేష్ గౌడ్ మరియు హమ్మండ్ పవర్ సొల్యూషన్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

# హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో దర్శనం చేసిన గోషామహల్ బీఆర్ఎస్ ఇంచార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్

హైదరాబాద్: ఏప్రిల్ 2(వాయిస్ టుడే): హనుమాన్ జయంతి సందర్భంగా గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ఉన్న హనుమాన్ దేవాలయాలను గోషామహల్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆర్వీ మహేందర్ కుమార్ సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. భక్తుల సంక్షేమం, ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## హనుమాన్ జయంతి సందర్భంగా బబ్బూ గూడ హనుమాన్ దేవాలయంలో ఘనంగా వేడుకలు

### -- మాజీ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్

కూకట్‌పల్లి: ఏప్రిల్ 2(వాయిస్ టుడే): హనుమాన్ జయంతి సందర్భంగా మోతీ నగర్ డివిజన్ పరిధిలోని బబ్బూ గూడ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మూసాపేట్ డివిజన్ 117 మాజీ కార్పొరేటర్ శ్రీ కొడిచెర్ల మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని భక్తి శ్రద్ధలతో సేవలు అందించారు.



## రాజన్న టీమ్ ఆధ్వర్యంలో చెట్లు నాటిన డీసీ చాముండేశ్వరి

కూకట్ పల్లి : ఏప్రిల్ 2(వాయిస్ టుడే): ఎల్లమ్మ బండ వాటర్ రిజర్వాయర్ వద్ద రాజన్న టీమ్ ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి చెట్లు నాటడం జరిగింది. ప్రగతికి మెట్లు పచ్చని చెట్లు అని చెట్లను కాపాడుకోవడం వల్ల అవి మనల్ని మన ఆరోగ్యాన్ని పరిసరాలను కాపాడతాయని నాటిన చెట్లను తొలగించకుండా జాగ్రత్త పడాలని డిసి చాముండేశ్వరి అన్నారు. ఇట్టి వాటర్ ట్యాంక్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు మరియు ఆకతాయిలు తరచూ స్థానికులను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి డిసి దృష్టికి తీసుకెళ్లగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు మరియు చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు చేయబోతున్నామని రాజన్న టీమ్ వివరించడంతో చెట్లు నాటడం జరిగిందని స్థానిక సమస్యల మీద అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్న రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవిని డిసి ప్రశంసించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, బాబు, రాజు, అరుణ్, ఉప్పల రాజు, హరీష్, శివ, లింగన్న, సుమన్ పలువురు పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక

### పెద్దవంగర సర్పంచ్ కాసాని హరీష్



పెద్దవంగర, వాయిస్ టుడే, ఏప్రిల్ 2: క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఒక బలమైన వేదికగా నిలుస్తుందని సర్పంచ్ కాసాని హరీష్ పేర్కొన్నారు. మండలంలోని కాన్వాయి గూడెం గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా తెలంగాణ జాతీయ గీతం ఆలపించగా, అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని స్పెషల్ ఆఫీసర్ చదివి వినిపించారు. గ్రామసభలో ప్రభుత్వ పథకాల అమలు, గ్రామాభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. సర్పంచ్ హరీష్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని చెప్పారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, వివిధ శాఖల గ్రామ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




## ప్రజలకు న్యాయసేవలు అందించాలి

తొర్రూరు, ఏప్రిల్ 2 వాయిస్ టుడే : ప్రజలకు న్యాయవాదులు న్యాయ సేవలు అందించాలని దళిత రత్న అవార్డు గ్రహీత, బేడ బుడగ జంగాల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ తూర్పాటి పాండు అన్నారు. గురువారం నూతనంగా ఎన్నికైన బార్ అధ్యక్షులు వీరదాసు వెంకటరత్నం, ఉపాధ్యక్షుడు డి. నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి టి. సైదులు, సంయుక్త కార్యదర్శి పల్లవి, స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ ఎం. ఎల్లేష్, కోశాధికారి కృపావతి, సభ్యులను సత్కరించారు. ఈ సందర్భంగా తూర్పాటి పాండు మాట్లాడుతూ న్యాయవాదులు వివిధ కేసులలో ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం జరిగేందుకు కృషి చేయాలని కోరారు. నూతనంగా ఎన్నికైన బార్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.




## బజరంగ్ సేన ఆధ్వర్యంలో ఘనంగా హనుమాన్ జన్మోత్సవ వేడుకలు

హైదరాబాద్, ఏప్రిల్ 02: హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో శ్రీ హనుమాన్ వ్యాయామశాల వద్ద ఆధ్యాత్మిక వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలలో బజరంగ్ సేన సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ఘనంగా మహా హారతి, అర్చనను నిర్వహించారు. శక్తి, ధైర్యం, శ్రేయస్సు కోరుతూ హనుమంతుని ఆశీర్వాదం కోరుతూ ప్రార్థనలు చేశారు. హారతి అనంతరం, సేవా స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ అన్నదానం కార్యక్రమం చేశారు. భక్తులకు పులిహోర, తీపి అన్నం, పెరుగు అన్నం, ఓఆర్ఎస్ టెట్రా ప్యాక్‌లు, ఇతర అల్పాహారాలు అందించారు. కార్యక్రమంలో ప్రభు బిరదార్, రాఘవ, గుణేష్, రాహుల్, కొండారెడ్డి, సోను రామేశ్వర్ మిశ్రా, వీరేందర్ అవస్థి తదితరులు పాల్గొన్నారు.



## సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 02: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం రాజేంద్రనగర్ లో స్థానిక ప్రజలు, భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఉదయం 60ఏళ్ల ( ఆరు దశాబ్దాల) పురాతన పంచముఖి హనుమాన్ చిత్రపటంతో భారీ ర్యాలీ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వెంకట్ రెడ్డి నగర్ లో ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజ లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– ఉప్పల్ నియోజకవర్గం వెంకట్ రెడ్డి నగర్ జై బజరంగ్ బలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జి మందముల్ల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆశిస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజల పై ఉండాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో ఆకారపు అరుణ్,జై బజరంగ్ బలి యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## వృత్తినే దైవంగా భావించి జర్నలిజం వృత్తికి గౌరవం తెచ్చిన వ్యక్తి నాగరాజు : బండి రమేష్

కూకట్‌పల్లి:ఏప్రిల్ 2(వాయిస్ టుడే): వృత్తినే దైవంగా భావించి జర్నలిజం వృత్తికి గౌరవం తెచ్చిన వ్యక్తి నాగరాజు అని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. నిలువుటద్దం నాగరాజు మరణించి నేటికి సంవత్సరం పూర్తయిన సందర్భంగా గురువారం మియాపూర్‌లోని ఆయన సోదరుడి నివాసంలో కుటుంబ సభ్యులు సంవత్సరీకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి హాజరై నాగరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజాలను నిగ్గు తేల్చడంలో పాత్రికేయ వృత్తికి గౌరవం తేవడంలో నాగరాజు ఎంతో నిబద్ధతతో వ్యవహరించారని అన్నారు. వృత్తిలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ముందుకు సాగిన వ్యక్తి నాగరాజు అని కొనియాడారు. చిరకాల మిత్రుని కోల్పోవడం బాధాకరమని పేర్కొంటూ, నాగరాజు కుటుంబ సభ్యులకు తాను మరియు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పుష్ప రెడ్డి, గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, దేశాలు ఫణిందర్, గోవిందు రాజు వాసు తదితరులు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నగౌడ్ జీవితం స్ఫూర్తిదాయకం

### మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్

తొర్రూరు, ఏప్రిల్ 2 వాయిస్ టుడే : రాచరికాన్ని ఎదిరించి స్వేచ్ఛ కోసం గోల్కొండను ఆక్రమించి ఉద్యమించిన మహోనీయుడు, ప్రజలకు స్వేచ్ఛ కోసం బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి పాపన్న గౌడ్ జీవితం స్ఫూర్తిదాయకమని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్,గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు.డివిజన్ కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316 వర్ధంతి వేడుకలను గౌడ సంఘాల ఆధ్వర్యంలో గురువారం విశ్రాంతి భవనం ముందు ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో చత్రపతి శివాజీ మహారాజ్ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజులు మాత్రమే మొగల్ పాలనకు వ్యతిరేకంగా విరోచితంగా పోరాటం చేసి తరిమికొట్టారని, పేద ప్రజలకు అండగా నిలిచి దోపిడి పాలనకు వ్యతిరేకంగా భారత మాత ఉక్కు సంకెళ్లను తెంచడానికి ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేశారని అన్నారు. పాపన్న గౌడ్ తెలంగాణ ప్రాంతంలోని జనగామ జిల్లా కిలాసపూర్ గ్రామంలో సామాన్య కల్లుగీత కార్మిక కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే పెత్తందారు, జమీందారులకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, పాపన్న గౌడ్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై పెట్టాలని, ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ను స్ఫూర్తిగా తీసుకొని రాజ్యాధికారం దిశగా ముందుకు



సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముద్దసాని సురేష్,తూర్పాటి రవి,పేర్ల జంపన్న,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ యూత్ జిల్లా నాయకులు రాజేష్ యాదవ్, గోపా డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్,జిఎస్పీఎస్ అధ్యక్షుడు ధీకొండ శ్రీనివాస్,కెఎస్ పిఎస్ అధ్యక్షుడు నాగపురి అశోక్ గౌడ్,ప్రధాన కార్యదర్శి కుంభం మహేష్ కుమార్ గౌడ్,రావుల శోభన్ బాబు,కెఎంపిఎస్ అధ్యక్షుడు చీకటి రమేష్ గౌడ్, కోశాధికారి జలగం రామ్మూర్తి గౌడ్, యువజన సంఘం జిల్లా కార్యదర్శి పబ్బాల రాము గౌడ్, గౌడ సంఘం నేత నాయకులు నిమ్మల వెంకన్న గౌడ్, బెల్లంకొండ దేవేందర్ గౌడ్, తాళ్లపల్లి బిక్షం గౌడ్, కొయ్యడ కుమారస్వామి గౌడ్,రాజ్ కుమార్ గౌడ్, ఎల్లా గౌడ్, వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలు

**ఆదర్శ గ్రామంగా నాగారం నిలవాలి**

**బాల్య వివాహాలను నిర్మూలించాలి..**

**బాలికలను ఉన్నత విద్యవైపు ప్రోత్సహించాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో పాల్గొన్న కలెక్టర్**




హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు గ్రామస్తుల సహకారంతో నాగారం ఆదర్శంగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం నాగారం గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభను గ్రామ సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన తహసీల్దార్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రం లో అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా అమలు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు,గృహజ్యోతి,చేయూత పింఛన్లు తదితర ఎన్నో పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయానికొస్తే ఒక్కో గ్రామానికి దాదాపుగా 35పైగా ఇండ్లు మంజూరై ఉన్నాయన్నారు. ఒక్క నాగారం గ్రామంలోనే 800 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, గృహ జ్యోతి పథకం కింద 63 లక్షల రూపాయలు వినియోగ దారులకు ఉచిత విద్యుత్ ప్రయోజనం కలిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ అమలుకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎల్3 లో ఉన్న వారికి తదుపరి ఇచ్చే ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించిందని,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం కావాలన్నారు. గ్రామంలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయం,ఆరోగ్య కేంద్రం, పాఠశాల,అంగన్వాడీ కేంద్రాలలో ఏవైనా చిన్న చిన్న సమస్యలు ఉన్నట్లయితే సర్పంచ్ బాధ్యత తీసుకుని పరిష్కరించాలని సూచించారు.

మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు అంటే మహిళా శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి నెల సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. గతంలో ఏవైనా రుణాలు తీసుకోవాలంటే ఇబ్బందులు ఉండేవని..కానీ ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇస్తామని బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. మహిళలు తీసుకున్న రుణాలను వంద శాతం తిరిగి చెల్లిస్తారనే నమ్మకం బ్యాంకర్లలో ఉందని పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించి నప్పుడు సంఘాలకు సంబంధించిన రుణాలు తీసుకోవడం చెల్లించడం లాంటివి చర్చించడంతోపాటు గ్రామానికి సంబంధించిన అంశాలను కూడా చర్చించాలని అన్నారు. ఆదర్శ గ్రామం అంటే మంచి రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ,స్ట్రీట్ లైట్స్ మాత్రమే కాదని ఒక్కరూ కూడా పోషణ లోపం లేని పిల్లలు,ఒక్కరు క్షయ వ్యాధి లేకుండా,రక్త హీనతతో గర్భిణీలు లేకుండా ఆదర్శ గ్రామంలో ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండకుండా ఏ అమ్మాయి పెళ్లి గ్రామంలో జరగకుండా చూసుకోవాలన్నారు. బాల బాలికలు డిగ్రీ వరకు చదివే విధంగా ప్రోత్సహించాలన్నారు. పిల్లల ఇష్ట ప్రకారం ఎక్కడి వరకు చదువుకోవాలనుకుంటే అక్కడి వరకు చదివించాలని సూచించారు. నాగారం గ్రామం కూడా ఆదర్శంగా ఉండే విధంగా తీర్చిదిద్దుదామన్నారు. గ్రామస్తుల సమష్టి సహకారంతోనే ఆదర్శ గ్రామం సాధ్యమని పేర్కొన్నారు. గృహ జ్యోతి,ఇందిరమ్మ ఇండ్లు,ఇతర పథకాల గురించి గ్రామానికి చెందిన తోట ప్రవీణ్ ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,విద్యుత్,ఇతర శాఖల అధికారులు గ్రామ అభివృద్ధికి సంబంధించి వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య,జిల్లా హౌసింగ్ పీడీ సిద్దార్ధ నాయక్,జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ,జడ్పీ డిప్యూటీ సీఈవో రవి,తహసీల్దార్ కిరణ్ కుమార్,ఎంపీడీవో సుమన వాణి,విద్యుత్ శాఖ డీఈ అశోక్ కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రీజనల్ సైన్స్ సెంటర్ సందర్శన

**పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని,కుడా ఛైర్మన్ ఇనగాల,జిల్లా కలెక్టర్**

**ఎస్సీ,ఎస్టీ సెల్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అధికారులు**


హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: హనుమకొండలోని రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి,హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను పరిశీలించారు. సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను,భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్ లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు,సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే,కుడా ఛైర్మన్,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు,సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు. తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ సెల్ ను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి,ఈఈ భీమ్ రావు,ఇతర అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## పేదప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రావణ్ కుమార్**

తొర్రూరు, ఏప్రిల్ 2 వాయిస్ టుడే : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు.గురువారం ప్రజాపాలన పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో 16 వార్డులలో వార్డు సభ కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ కార్యక్రమాన్ని కమిషనర్ శ్యాంసుందర్ ఏర్పాటు చేశారు. ముందస్తుగా తెలంగాణ రాష్ట్ర గేయాన్ని ఆలపించారు.సీఎం రేవంత్ రెడ్డి సందేశం చదివి ప్రతి ఒక్కరికి వివరించారు.తెలంగాణ రాష్ట్ర మేనిఫెస్టో ఛైర్మన్, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టినటువంటి రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ప్రజల వద్ద నుండి వివిధ రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో మున్సిపల్ ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా సభలు వేదిక కావాలని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సేవల విస్తరణ, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళా సాధికారత వంటి పథకాలను ప్రభు త్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా మున్సిపల్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ సోమ రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు, వార్డుల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా ఆర్.పి లు, వైద్య సిబ్బంది, అంగన్ వాడి టీచర్స్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పంచముఖ నాగేంద్ర స్వామి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలు

తొర్రూరు, ఏప్రిల్ 2 వాయిస్ టుడే : తొర్రూరు డివిజన్ కేంద్రంలోని పంచముఖ నాగేంద్ర స్వామి దేవాలయంలో 20వ వార్షికోత్సవ వేడుకలు గురువారం రోజున ఆలయ అర్చకులు ఓలేటిగీతాచార్యులు , యాదగిరాచార్యులు ,నరసింహమూర్తి శర్మ , గన్నవరం ఘనంగా కనుల పండువగా, ఘనంగా నిర్వహించారు . ఉదయం 6 గంటలకు పూజా కార్యక్రమాల ను ప్రారంభించారు. పంచ సూక్తపఠనంతో , గోక్షిరాభిషేకం పంచామృత అభిషేకం, అష్టోత్తర పూజ ,మహా నివేదన, మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రీయంగా నిర్వహించారు. స్వామి వారిని నూతన వస్త్రాలతో పుష్ప మాలతో సుందరంగా అలంక రించారు. అనంతరం అశ్వత్థ నారాయణ కళ్యాణోత్సవం చేపట్టగా, స్వామివారికి యజ్ఞోపవీత ధారణ, మధుపర్కం మహా సంకల్పం మొదలగు కార్యక్రమాలను లోక కళ్యాణార్ధం కన్నుల పండుగగా జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో సంగారెడ్డిపేట రాహుల్ హరిత దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలను, మాంగల్యాన్ని సమర్పించారు. ఈ కళ్యాణవేడుకల లో మునిసిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ ,కౌన్సిలర్ చకిలేలా అలివేణి ,ఆలయ కమిటీ చైర్మన్ గోపారపు నాగేశ్వరరావు సభ్యులు కల్లూరి నాగేంద్ర చారి ధార నాగ శివప్రసాద్ ,నాగరాజు మణికుమార్ మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం దీక్ష ప్రసాద వినియోగం చేశారు. ఆలయ కమిటీ తరపున చైర్మన్ శ్రావణ్ కుమార్ ను ఘనంగా సత్కరించారు.




## సేవాకార్యక్రమాలకు చేయూతనందించాలి

తొర్రూరు, ఏప్రిల్ 2 (వాయిస్ టుడే) : సామాజిక సేవాకార్యక్రమాలకు చేయూతనం దించాలని పిడిజి లయన్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్నం రామ నరసయ్య లు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు మండలంలోని సోమారం గ్రామపంచాయతీకి బాడీ ఫ్రీజర్ బాక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబాలకు లయన్స్ క్లబ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు లక్ష్మీనరసింహ రావు, టి వెంకటరెడ్డి, విశ్వేశ్వరరావు, లయన్స్ క్లబ్ సెక్రటరీ ముడుపు రవీందర్ రెడ్డి, ట్రెజరర్ వజనపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.




## గౌరారంలో 99 రోజుల ప్రజాపాలన గ్రామసభ

పిట్లం, ఏప్రిల్ 2 వాయిస్ టుడే : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థులతో చర్చించి వారి నుంచి వినతులు, సూచనలు స్వీకరించారు. ఈ గ్రామసభను గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించగా, పంచాయతీ సెక్రెటరీ బి. లక్ష్మణ్, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఉప సర్పంచ్ హనుమాన్లు, వార్డ్ మెంబర్లు కుమ్మరి రాజు మారుతి వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జె శంకర్ మహేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గౌరారంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు



పిట్లం, ఏప్రిల్ 2 (వాయిస్ టుడే) : కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా జరిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. అలాగే గ్రామ దేవతలకు బండ్ల ప్రదక్షిణ నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు జుప్పాల శంకర్ లక్ష్మా గౌడ్ కాంట్రవిటల్ కాడల సంతు కుమ్మరి రమేష్ కుమార్ అంజయ్య దేంజరాయుడు ఎస్ రాములు మరియు గ్రామ ప్రజలు, మహిళలు యువత బంధువులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా భక్తి వాతావరణంతో నిండిపోయి పండుగ శోభను సంతరించుకుంది.




# ప్రభుత్వ ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తించాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన గ్రూప్ -1 అధికారులతో సమావేశం**



హనుమకొండ జిల్లా,వాయిస్ టుడే: గ్రూప్-1 కేడర్ కు ఎంపికై వివిధ జిల్లాల్లో అధికారులుగా నియమితులైన వారు ప్రభుత్వ ఉద్యోగాన్ని ఎంతో బాధ్యతగా నిర్వర్తించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 64మంది గ్రూప్-1 అధికారులతో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సమావేశమయ్యారు. రాష్ట్రంలో గ్రూప్ వన్ ఎగ్జామ్స్ లో సెలెక్ట్ అయ్యి క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన 64 మంది గ్రూప్-1 కేడర్ ఆఫీసర్లు ఆత్మకూరు,దామెర మండలాల్లో స్వయం సహాయక సంఘాలు,గ్రామ సంఘాల,మండల సమైక్య సమావేశాలను పరిశీలించారు. క్షేత్ర పర్యటన అనంతరం హనుమకొండ కలెక్టరేట్ కు రాగా జిల్లా కలెక్టర్ వారితో సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ గ్రూప్ వన్ ఉద్యోగాలను యంగ్ ఏజ్ లోనే సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. తక్కువ ఏజ్ లోనే ఉద్యోగం సాధించిన వారికి ఎంతో సర్వీస్ ఉంటుందన్నారు. ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించు కోవాలని సూచించారు. ఎంతో కష్టపడి చదివి గ్రూప్ వన్ కేడర్ ఉద్యోగాన్ని సాధించారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని బాధ్యతగా తీసుకొని ప్రజలకు సేవ చేయాలని తెలియజేయడం జరిగింది. ఉద్యోగాన్ని బాధ్యతగా తీసుకొని ఆ ఉద్యోగానికి న్యాయం చేయాలన్నారు. ఉద్యోగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను,సెర్ప్ డైరెక్టర్ నవీన్,అడిషనల్ డిఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఎంసిహెచ్ఆర్డీ ఫీల్డ్ విజిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డిపిఎంలు దయాకర్,అనిత,ఏపిఎం రవీందర్, పాల్గొన్నారు.

# మండల అభివృద్ధికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

# మున్సిపల్ వార్డులలో కొనసాగిన ప్రగతి ప్రణాళిక



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఏప్రిల్ 2 వాయిస్ టుడే : : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో మున్సిపల్ పరిధిలోని 15 వార్డులలో ఆయా వార్డు కౌన్సిలర్ లు బుధవారం సమావేశాలు నిర్వహించారు. ముందుగా తెలంగాణ జాతీయ గీతంతో సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి పంపిన సందేహాన్ని వార్డు అధికారులు, ప్రజలకు చదివి వినిపించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్పు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు మున్సిపల్ లో నీ 15 వార్డుల్లో చేపట్టిన అభివృద్ధిని, చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను 6 గ్యారంటీల అమలు ఇందిరమ్మ గృహాలు, నిరంతర రేషన్ కార్డుల పంపిణీని సిసి రోడ్లు డ్రైనేజీలు, త్రాగునీటి సమస్యలను తీర్చేందుకు అదనపు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. లూస్ లైన్ ల క్రింద కరెంటు స్తంభాలు, జీరో కరెంట్ బిల్లు, విద్యుత్ దీపాలతో పాటు రానున్న రోజుల్లో అందించబోయే ఇందిరమ్మ గృహాలు పెన్షన్లు, మహిళలకు జీరో వడ్డీ రుణాల పంపిణీ తో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తామని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్పు విజయ రమణారావు సాకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల నుండి నూతన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, కమిషనర్ టి రమేష్ 15 వార్డుల కౌన్సిలర్ లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

**మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో**

మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామ సభలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిన సందేశాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు చదివి వినిపించారు. అనంతరం గ్రామసభలో చేపట్టబోయే అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను సర్పంచులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీడీవో దివ్య దర్శన్ రావు తో పాటు ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు పంచాయితీ కార్యదర్శులు ఆయా శాఖ అధికారులు ప్రజలు పాల్గొన్నారు.




## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

వేములవాడ, ఏప్రిల్ 02 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణం లోని 25 వార్డు లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా నిర్వహిస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక వార్డు సభ కార్యక్రమం లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం సేవా భావం తో పనిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందనీ. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల సమస్యల పరిష్కారం పై దృష్టి పెట్టి, పథకాలను అర్హులకు చేరవేస్తోందన్నారు.తెలంగాణ రైజింగ్ -- 2047 లక్ష్యం తో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శం గా తీర్చిదిద్దాలని సంకల్పం తో ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాజన్న దేవస్థానంలో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 02 (వాయిస్ టుడే):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లో హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధల తో నిర్వహిం చారు.ఈ సందర్భం గా దేవస్థానం అభివృద్ధి లో భాగంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి ఆలయ అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహించారు.హనుమాన్ చిన్న జయంతి సందర్భం గా వీరాంజనేయ స్వామి వారికి మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత ధారాభిషేకం, మహాపూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం పరిధి లోని అనుబంధ ఆలయాలలో పరివార దేవతలకు, ఆలయం లో ఉన్న హనుమాన్ మూలమూర్తులకు మేళతాళాల మధ్య వేద స్వస్తి మంత్రా లతో చందనాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భం గారాజన్న భీమన్న ఆలయా లతో పాటు అను బంధ ఆలయాలను మామిడాకులు, కొబ్బరాకులతో చేసిన తోరణాలు మరియు రంగురంగుల పూల తో అందంగా అలంకరించారు.ఈ పూజా కార్యక్రమం లో ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి పాల్గొని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకు న్నారు.హనుమాన్ చిన్న జయంతి సందర్భం గా హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. దీంతో ఆలయం లో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ అర్చకులు, వేద పండితులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## విద్యుత్ ఉద్యోగుల నిరసనకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ నిర్మల్ కమిటీ ఆధ్వర్యంలో గత 10 రోజుల నుండి చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నేడు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులకు పూర్తి మద్దతుగా భారతీయ జనతా పార్టీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు, బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## మహమ్మాయి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఏప్రిల్-02 (వాయిస్ టుడే) : సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో మహమ్మాయి దేవి అమ్మవారి బ్రహ్మోత్సవముల సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వవిప్ శాసనసభ్యులు చింతకుంట విజయరమణా రావు ముందుగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే విజయరమణా రావు ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్,మున్సిపల్ చైర్మన్ మార్కెట్ చైర్మన్ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో భాగస్వాములైన గోవిందరావుపేట ప్రజలు

**సర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ సభ**

కోనరావుపేట, (వాయిస్ టుడే) ఏప్రిల్ 02 : కోనరావుపేట మండలంలోని గోవిందరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తిరుపతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ, గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ, ప్రాధాన్యత క్రమంలో గ్రామంలోని మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సమస్యల పరిష్కారం, వీధి దీపాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ఉపసర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామ ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామస్తులు ఇచ్చే సూచనలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ , వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు మరియు మహిళలు పాల్గొన్నారు.

## ఇసుక పర్మిషన్ ప్రతిరోజు ఇవ్వాలి



సిరిసిల్ల, ఏప్రిల్ 02,(వాయిస్ టుడే): ఏఐటీయూసీ కార్మిక భవన్ సుభాష్ నగర్ లో భవన నిర్మాణ కార్మిక సమస్య లపై జిల్లా కార్యదర్శి కడారి. రాములు మాట్లాడుతూ,ఇసుక పర్మిషన్ కోసం తీసిన డిడి లు సైతం వాపస్ ఇస్తున్నారని, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, నిర్మాణాలు ప్రారంభం ఐన తరువాత ఒక్క సారి గా ఇసుక, మొరం కు, కట్టు రౌతు కు రెండింతలు ధరలు పెరగడం తో గృహ నిర్మాణ దారులపై పెనుబారం పెరిగిందని, ఇసుక వారం లో ఒక రోజు రావడం తో కార్మికులకు ఉపాది లేకుండా పోయిందని, ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాక ట్రాక్టర్ లు, టిప్పర్ లు కొన్న వారికి ఉపాది లేక ఫైనాన్స్ లు సైతం కట్టలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు, తక్షణమే ప్రతిరోజూ ఇసుక కు పెర్మిషన్ ఇచ్చి కార్మికులను, గృహ యాజమాన్యం ను ఆర్థిక భారం పడ కుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజ్జ. వేణు, నాయకులు వడ్డెపెల్లి. లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.



## పూలే దంపతుల విగ్రహ స్థాపనకు భూమిపూజ

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ 02 (వాయిస్ టుడే) ఎల్లారెడ్డిపేట మండలం లోని కోరుట్ల పేట గ్రామం లో మహాత్మా జోతి రావుపూలే దంపతుల విగ్రహ స్థాపనకు గ్రామ సర్పంచ్ మేడిపల్లి జ్యోతి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో పాలకవర్గం, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తేది 11/4/1827న మహారాష్ట్ర లోని సతారా గ్రామంలో పూల వ్యాపారం చేసే సాధారణ కుటుంబం లో జన్మించారు. కుల వ్యవస్థ అంటరాని తనం నాడే తీవ్రంగా వ్యతి రేకించిన మొదటి వ్యక్తి ఆయన అనగారిన వర్గాలకు విద్య ను అందుబాటు లో తెస్తే కుల వ్యవస్థ కుంటుపడుతుందని అనగారిన వర్గాలకు విద్యాబోధన చేయడానికి నడుం బిగించారు. పూణే లో 1848లో బాలికల కోసం పాఠశాల నిర్మించి విద్య నందించిన దంపతులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలు. మహిళా విద్యాభ్యాసానికి నాంది పలికి తొలి మహిళా గురువు గా సావిత్రిబాయి పూలే నిలిచారు. 1873 లో దళితులు మరియు వెనుకబడిన వర్గాలు సమానం చేసే ఉద్దేశం తో సత్య శోధకు సమాజం ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలను రద్దుచేసి వితంతు వివాహాలను ప్రోత్సహించారు. జ్యోతిరావు పూలే సమాజ సేవను గుర్తించి 1888లో మహాత్మ అను బిరుదును నాటి ప్రభుత్వం ప్రధానం చేసింది బానిసత్వం, రైతు వేదన వంటి మొదలగు రచనలు చేశా రు. ఆధునిక భారతదేశ సామాజిక సమరయోధులలో ఒకరుగా నిలిచారు అని అన్నారు.



## జోడు హనుమాన్ దేవాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 02 (వాయిస్ టుడే); రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం లోని అగ్రహారం జోడు హనుమాన్ దేవాలయం లో గురువారం చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ స్వామి వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భం గా ఆలయ పూజారులు ప్రభుత్వ విప్ కు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి కి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# రూ. 1.06 కోట్లతో కౌట్ల బి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: సారంగాపూర్ మండలం కౌట్ల (బి) గ్రామంలో రూ. 1కోటి 6లక్షల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా గ్రామంలో రూ.30 లక్షలతో స్ హ్ జి (వి ఓ) మూడు భవనాల నిర్మాణాని,రూ. 30 లక్షలతో స్ హ్ జి (వి ఓ) మూడు వర్కింగ్ షెడ్ల నిర్మాణానికి,రూ.24 లక్షలతో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి,రూ.2 లక్షలతో జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి, రూ. 20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ ల నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, మండల అధ్యక్షులు నరేష్, గ్రామ ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు భూమా రెడ్డి, సత్యపాల్ రెడ్డి, రాజు రెడ్డి, దయాకర్ రెడ్డి, తో పాటు మండల నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వాయిస్ టుడే
హైదరాబాద్
శుక్రవారం 3 ఏప్రిల్ 2026



## బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

### చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: నిర్మల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్. బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, బహుజన పీడిత వర్గాల కొరకు మొగులాయి దౌర్జన్యాలను ఎదిరించి పోరాటాలు చేసి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఇటువంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, బిసి, మైనారిటీల సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, డీఈవో భోజన్న, పలువురు కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం దక్కించుకున్న నల్ల మనోహర్ రెడ్డికి ఘన సన్మానం

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఏప్రిల్–02 వాయిస్ టుడే : సుల్తానాబాద్ బిజెపి మండల, పట్టణ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన నల్ల మనోహర్ రెడ్డి ని పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు ఆధ్వర్యంలో బోకే పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపడం జరిగింది, ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కడారి అశోక్ రావు పాల్గొని, ఈ సందర్భంగా అశోక్ రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కొమ్ము తిరుపతి యాదవ్,ఓబీసీ జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్, బిజెపి జిల్లా కోశాధికారి కామని రాజేంద్రప్రసాద్, గజభీంకార్ పవన్, లంక శంకర్, ఎల్లంకి రాజన్న, పసేడ్ల రవి,ఎనగందుల సతీష్, గుడ్ల వెంకటేష్, పల్లె ఓదెలు, పవన్, పెర్క రమేష్, మారం రమేష్, దొంగల శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, ఎలవేణి శ్రీనివాస్, ఆగండ్ల శంకర్, ఆగండ్ల గట్టయ్య, మేకల కిరణ్, మ్యాకల శ్రీనివాస్, మేకల రాజ్ కుమార్, బుర్ర సతీష్ గౌడ్, నూనె మహేష్, మనోహర్, ఇనుగాల శ్రీనివాస్, బత్తుల చంద్రశేఖర్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నిర్మల్‌లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు ఆలయాలను దర్శించుకున్న శ్రీహరి రావు

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్మల్ పట్టణంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు పట్టణంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలకు శాంతి, సుభిక్షం కలగాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హనుమంతుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బ్యూరో ఏప్రిల్ 2 వాయిస్ టుడే: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పిట్లం మండల వరి ధాన్యం కేంద్రాలను గురువారం ఆయా గ్రామ సర్పంచ్లు మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్ వరి ధాన్య కేంద్రాలను ప్రారంభించారు. సర్పంచిని మాట్లాడుతూ రైతులు ఆరు కాలాలు పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకూడదు అని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో దాన్యం విక్రయించి లబ్ధి పొందాలని సర్పంచ్ కోరారు. ప్రతి ఆఖరి గింజ వరకు కొనుగోలు కేంద్రాలు చేస్తదని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ ఆవేస్ బేగ్ కార్యదర్శి శ్రీకాంత్,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పాల్వంచ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పాల్వంచ, ఏప్రిల్ 2 (వాయిస్ టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని సి కాలనీ గేటు వద్ద శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. వివిధ పూలమాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు భార్గవ్ ఆచార్యులు మాట్లాడుతూ ఈ రోజు హనుమాన్ విజయోత్సవ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు పంచామృత అభిషేకం నిర్వహించామని తెలిపారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తారు అని తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు, అర్చకులు వినయ్ ఆచార్యులు పాల్గొన్నారు.

## అంజన్న ఆశీర్వాదం ఉంటే విజయమే: మంత్రి వాకిటి శ్రీహరి

### ఘనంగా హనుమాన్ విజయోత్సవ ర్యాలీ ప్రారంభోత్సవం



మక్తల్ ఏప్రిల్ 02 వాయిస్ టుడే ప్రతినిధి: సంకల్పబలంతో ఆంజనేయస్వామి తలుచుకొని పనులు ప్రారంభిస్తే విజయం సొంతం నమ్మకం అంటు గురువారం సాయంత్రం ఆరు గంటలకు మక్తల్ పట్టణంలోని ఆజాద్ నగర్ చౌరస్తా ఈశ్వరాలయం నుండి జై భజరంగబలి వీర హనుమాన్ నినాదాలతో శ్రీ హనుమాన్ విజయోత్సవ ర్యాలిలో యువకులను వెన్ను తట్టి మంత్రి వాకిటి శ్రీహరి ర్యాలిని ప్రారంభించారు. అంతకుముందు వక్తలు మాట్లాడుతూ గతంలో గతంలో అఖండ భారతావనిలో హిందూమతం లో కులాలు లేవని అందరి ధర్మం ఒకటే హిందూ అని జీవించేవారని పరాయి పాలకుల వంచనతో కులాలుగా విడదీసి హిందుల ఐక్యత చేడగోట్టా రన్నారు. యువకులు ప్రతి ఒక్కరూ హిందూ సనాత ధర్మాన్ని పాటించాలని మనకు మన ఇంటికి దేశానికి రక్షణగా ఉంటుందని పలువురు వక్తులు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు కొండయ్య. విశ్వ హిందు పరిషత్. బజరంగ్దళ్ నాయకులు. మక్తల్ మున్సిపల్ చైర్పర్సన్ మానస అఖిలపక్ష కౌన్సిలర్లు మున్సిపల్ కౌన్సిలర్స్. రాజశేఖర్ రెడ్డి ,పీకే నరసింహ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు ఏ రవికుమార్, అమరేందర్ రెడ్డి, నీలప్ప, కోళ్ల వెంకటేష్ హనుమంతు, నాగరాజ్, మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహ గౌడ్, బిజెపి నాయకులు బలరాం రెడ్డి, కర్ణ స్వామి, భీమ్ రెడ్డి పాల్గొన్నారు.



## వార్డు సభల నిర్వహణ ద్వారా సమస్యలపరిష్కారం: కలెక్టర్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: నిర్మల్ జిల్లాలో నీ వార్డు సభల నిర్వహణ ద్వారా వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా నిర్మల్ పట్టణంలోని బుధవార్పేట్ మోచి గల్లి లో ఏర్పాటు చేసిన వార్డు సభలో కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రజలంతా ఈ పథకాలను వినియోగించు కోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ మున్సిపల్ కమిషనర్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## లక్ష్మణ్ చందాలో మొక్కజొన్న పంట దగ్నం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: నిర్మల్ జిల్లా లక్ష్మణ్ చందా మండల్ సమీపంలోని మునిపల్లి వద్ద విద్యుత్ ఘాతం కారణంగా అయిండ్ల లావణ్య అనే మహిళ రైతుకు చెందిన అరేకరం మొక్కజొన్న పంట దగ్నమైంది. కోసి కుప్పలుగా వేసిన పంటపై ట్రాన్స్ పరం వద్ద రాపిడికి గురైన 11 కేపీ విద్యుత్ తీగలు నుండి నిప్పు రవ్వలు పడి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో రైతు సుమారు 50 వేల వరకు నష్టపోయినట్లు తెలిపారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.



## నిర్మల్ బస్టాండ్‌లో మజ్జిగ పంపిణీ

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: నిర్మల్ జిల్లా లోని బస్టాండ్ ప్రాంగణంలో ఎండల తీవ్రత దృశ్య నిర్మల్ బస్టాండ్ ఆవరణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షులు లక్కడి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఆసుపత్రిలో పాటు వేసవిలో ప్రయాణికులకు దాహార్తిని తీరుస్తున్నట్లు సమితి సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్వచ్ఛంద సేవకులు సాయి దీక్ష సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా ఈఎంటి డే



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే ఏప్రిల్ 02: నిర్మల్ జిల్లా కేంద్రంలోని గురువారం 108 అంబులెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో ఈఎంటి డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ భీమ్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది జిల్లాల్లో 31.977 అత్యవసర కేసుల్లో ఈఎంటిలు సేవలందించడం అభినందనీయం మన్నారు. గోల్డెన్ అవర్ లో అంది అందించే సేవలో ప్రాణాలను కాపాడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొని కేక్ కట్ చేశారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఏప్రిల్ 02: సోన్ మండల్ కడ్తాల్ గ్రామపంచాయతీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ గుర్రం రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం 80 కొత్త రేషన్ కార్డులు 11 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని తెలిపారు. పేద ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సర్పంచ్ ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి వార్డు సభ్యులు గ్రామ యువకులు యువతలో పాల్గొన్నారు.



## ప్రజాకరణ ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

పాల్వంచ ఏప్రిల్ 2 (వాయిస్ టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 6 వ డివిజన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా గురువారం ఆరవ డివిజన్ ఇంద్ర నగర్ కాలనీలో జరిగిన గ్రామ సభలలో కార్పొరేటర్ బిఎస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సభలో బిఎస్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి చేపడుతున్నదన్నారు. ఆరు గ్యారంటీలలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలు గ్యాస్ సబ్సిడీ పథకం, సన్న రకం ధాన్యం కొనుగోలుకు క్వింటాకు 500 రూపాయలు బోనస్, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు, త్వరలో కొత్త పెన్షన్ ల పంపిణి, కొత్త రేషన్ కార్డుల పంపిణి, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ల మంజూరు వంటి పథకాలు ప్రజలకు అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతలచెరువు రమేష్ , జగన్నాథం అజిత్, అమీర్ , ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పరిశ్రమ వ్యర్థాలపై నిర్లక్ష్యం ఎందుకు

### అధికారులపై మంత్రి కొండా సురేఖ అగ్రహం

మహబూబ్నగర్ జిల్లా ఏప్రిల్ 2 (వాయిస్ టుడే) : జడ్చర్ల నియోజకవర్గంలోని పోలేపల్లి ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థాలను లెదర్ పార్క్ భూముల్లో అక్రమంగా పారబోస్తున్న ఘటనపై రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని మంత్రి మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకే స్పందించని అధికారులు సాధారణ ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారో సమాధానం చెప్పాలన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని అన్నారు సోమవారం సచివాలయంలో జరిగే ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అలాగే రెడ్ జోన్ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు కూడా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు, పరిశ్రమల వ్యర్థాల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**